# రాముని బల్లని సీత

రైల్వే స్టేషను అంటేనే హడావుడి. కాదా మరి...?భాగ్యవంతులు, దౌర్భాగ్యులు, అదృష్టవంతులు. కష్టజీవులూ అందరికీ... ఒకప్పుడు గాకపోతే ఒకసారయినా దీని అనవసరం వస్తుంది. విద్యార్థులూ. నిరుద్యోగులూ అయిన యువలోకానికి దీంతో ఒక చక్కని సమ్మంధం వుందంటే ఎవరూ కొత్త విషయం అనుకోరు.

ఉబుసుపోకకీ పెద్ద పెద్ద స్టేషన్లమీద పడి ఎంతో నాజూకయిన నాగరికయిన యువక బృందం వచ్చే వెళ్ళే రైలు బళ్లన్నిటికి స్వాగతమూ. వీడ్కోలూ యిస్తూ యధాశక్తి దేశసేవ చేస్తారు!

చూపరులకి వీళ్ళు ఎవరికోసమో వచ్చినట్లో ఎక్కడికికో బహుశా పెద్దవుద్యోగం ఇంటర్వ్యూకి దూరదేశం చదువుకీ, లేదా ఏ పెళ్లి చూపులకో వెళ్లి ఏయింటినో వుద్ధరించడానికా? అన్నట్లు కనబడతాడరు.

ఇలాంటి రైల్వే ప్లాట్‌ఫారం రోమియోలను, చెడ్డవాళ్లూ, వ్యభిచారులూ, తుంటరులూ అని ఎంతమాత్రమూ అనలేము.

అంటే తప్పకుండా నరకం సిద్ధిస్తుంది. కాని అందరూ మనలాంటివాళ్లే వుండరు. అంతా మంచివాళ్లే అవరు.

రామారావు కర్మకాలి యిలాంటి అపఖ్యాతి వచ్చింది. సీత నవనాగరికమయింది. అయ్యిండినీ అతన్ని ఇంత అపవాదుతో కొట్టిపారేసింది...

అసలు ఎవరీ రావుఁడు? ఎవరీ అహంకారవతి అయిన కుమారీ... అని మీరు కొంచెం ఇదవుతున్నారు. అసలు సదరు విషయ చెప్పడమే నా ఉద్దేశ్యం.

ఆవేళ కొంచెం కొంచెం తుంపర రాలుతున్నది. ఆకాశం అంతా అలుక్కున్నట్లు చీకటిగానూ. మేఘమయంగానూ వుంది.

రైలుస్టేషన్లో అడావుడి మామూలుగా వున్నా, ఎత్తుకున్న కాలర్లూ. మడిచిపెట్టిన ఫాంట్లూ, చుట్టు కొన్న మఫర్లూ నిండుగా వున్నాయి. స్టేషన్లోని దీపాలన్నీ వెలుగుతున్నా కొంచెం మందకొడిగా

వుంది.

రామారావు బూటు పాడవకుండా క్రాపు తడవకుండా.. సిగరెట్ ఆరకుండా.. ఒగరుస్తూ వచ్చి గ్రాండుట్రంక్ ఎక్స్‌ప్రెస్‌ని పరామర్శించడానికి అంత మందకొడి వాతావరణంలోనూ పూనుకున్నాడు.

రామారవు బియ్యే వెలగబెట్టి.. ఎమ్మే తగల బెట్టిన యువకుడు. అంతో యింతో వెనక వేసిన పరంధామయ్యగారి మూడో ముద్దుబిడ్డడూ అవడం అతని స్పెషల్ క్వాలిఫికేషను.

కష్టపడి మొహంమీద పెట్టుకున్న వుంగరాలు చెరిగి.. చెదిరిపోకుండా ఫస్టుక్లాసులన్నీ పరికించాడు...

అందమయిన ఆడపిల్లలంటే అతనికి చాలా యిష్టం!... అతనికి అని అనడం.. మిగతా యువలోకానికి కోపకారణమవుతుంది.

ఇక్కడికి అతగాడొక్కడే మన్మధుడు అయినట్లూ, తాము గాకపోయినట్లూ ఫీలవుతే... నేను బాధపడాలిగనుక నేటి "యువత"కి నాజూకయిన అమ్మాయిలందరిమీదా ప్లాటానిక్ లవ్!...

దీన్ని ఆదర్మ ప్రేమగా అందరూ తెలుసుకొని అంగీకరిస్తే... బాగానే వుండును.

....కానీ రామారావు దురదృష్టం!... అందుకు మనం కర్తలంగాము. నేనెంతమాత్రమూ కర్తనిగాను. కధకుణ్ణి గనుక చెబుతున్నాను!...

సెకండు క్లాసులను పరిశీలిస్తూపోతున్నాడు.... ఒక అమ్మాయి వాలుచూపులు వాడిగా గుచ్చుకొన్నాయ్... రామారావు గభుక్కున కన్నుగీటి, కిసుక్కున నవ్వేసేడు!...

తాంబూల చర్వణం, ధూమపానం రెండూ నిత్యం సేవించిన అతని కావిరంగు పలువరస... అంత నిర్మోహమాటంగా యింకా మగరాయుళ్ల మూగప్రేమ సైగల ధాటికి తట్టుకోడం తెలీని ఆ ముగ్ధకి.. ముక్కుమీద కోపాన్ని రెచ్చగొట్టింది.

ఎక్కడయినా ఎక్కడ... అవకపోయినా ఇలాంటిచోట్ల ఆడపిల్లలు అబలలు కదా!...

.... అధవా ఏ పిల్లయినా అన్నయ్యకో నాన్నకో చెబుతూందే అనుకోండి!... నా పిచ్చిగానీ ఏమని చెబుతుందీ? ..

...సరి రైలు వెళ్లిపోతూంటే ఎవడో అబ్బాయి తన పిల్లకి సైగలు చేసేడని ఏ మగాడు మాత్రం చెయ్యీ నోరూ చేసుకుంటాడు?..

సరే, అసలు విషయానికి వద్దాం!..

అంటే,సీత రామారావుని తృణీకరించిన కధనం.

ఇంక రామారావుకి ఆ రోజు.. . తుంపరలో.. ఆ రైలుబండి సర్వేపూచీ తీరిపోయింది?...

అందమయిన సీతాకోకచిలుక అతని కంటబడింది!...

కొందరి మగాళ్లకిమల్లే రామారావుకి కూడా కోపంవచ్చిన ముగ్ధ మొహం అంటే యిష్టమో... ఏమో!...

....లేకపోతే, ఆ అమ్మాయి తననంత తేలిగ్గా ముక్కేసి మూతి బిగించుకొన్నదన్న కోపమో గానీ...

...మొత్తానికి అరగంటసేపూ అష్టవంకరలూ తిరిగి.. ఒక శతమానం పోజులన్నాయిచ్చేడు!...

...అరడజను సిగరెట్లయినా అరవైరకాలుగా కాల్చి పారేసేడు!...

తర్వాత, బరువుగా రైలుకి వీడ్కోలిచ్చి... పాకెట్ రుమాలు దానికేసి వూపి... గుటకలు మింగుతూ అక్కడే వుండిపోయాడు.

అనక. అతగాడు యిల్లుచేరుకుని ఏమో అయ్యుండొచ్చు!... విరహాగ్నిలో సతమతమయి స్టేషన్లో హాజరు అవకపోవచ్చును... అవ్వొచ్చును!... సదరు గ్రంధమంతా అప్రస్తుతం కదా మనకి...

రైలు గుప్పు గుప్పున కదులుతున్నపుడు పక్కనున్న ప్రౌఢ యీ రసగ్రంధమంతా పరికించి వున్నదికాబోలు.. సానుభూతిగాఅన్నది.

“ఛీ! యీ కుక్రారేయింతః అయినా, వాడేం కుర్రాడులే!... స్టేషన్లో వాడి ఉద్యోగమే యిలాగ!.. ముండలంటా యీ ముండలంటా తిరగడం.. ఎవడిదో జేబు తరగడం... నెత్తి మొత్తడం హాయిగా తిరగడం యిదే ఉద్యోగం వీళ్లకి...” అంటూ, ఇలాంటివే మరి వందమైళ్ళు రైలుదాటి ఆగేలోపున ఒక గ్రంధమంతా చెప్పి ఆ ప్రౌఢ దిగిపోయింది.

కానీ, సీత గుండెల్లో పోరంబోకూ, పనికి మాలినవాడూ అని ఆమె యిచ్చిన సర్టిఫికేటుతో సహా... రామారావూ అతగాడి దౌర్జన్యాలూ అచ్చుగుద్దినట్లు పడ్డాయి!...

“అందం అంతా యిలాంటి బుద్ధిహీనుల కెందుకు పెడతాడు దేవుఁడు?....” అనుకుంది సీత, అంచేత రామారావు అందమయిన వాడని మనం ఒప్పుకోవచ్చును....!

తర్వాత, ఒక కేలండరు కాయితం మారిన వెనుక... సదరు సీతకి పెళ్ళిచూపులు నిశ్చయమయ్యేయి.

దైవికంగా జరిగిందేమిటంటే.. చూపులకి వచ్చిన పెళ్లికొడుకు రామారావు?... ఏమ్మే చదివేడు. భవిష్యత్తులో ప్యాసవుతానంటాడు అతగాడు. వాళ్ళ నాన్న కాబోలు అనుకుంటాడు.

యధావిధిగా జరిగింది, పెళ్లి చూపుల కార్యక్రమం.

ఎదురుగుండా కూర్చున్న సీతను చూసి రామారావు గిలిగింతలయ్యేడు. మురిసిపోయేడు!... కొడుకు దుర్బలత్వాన్ని తండ్రి చూసి కొంచెం యిదయ్యేడుకూడాను.

ఆవేళ రైల్లో చూసివున్న కారణంచేత, ఫలాని చోట చూసేను అన్న జ్ఞాపకం లేకపోయినా ఎక్కడో చూసిన సౌందర్యమూర్తి ఆమె అని అతగాడు తియ్యగా కలలు కంటున్నాడు.

కానీ, ముగ్ధలాగ... ముడుచుకున్న మొగ్గలాగ కూర్చున్న సీత తలెత్తి ఈ అభినవ రాముణ్ని చూసి గభిక్కున తలదించుకుని... భగ్గుమన్నది!...

ఆవేళ రైల్వే ప్లాట్ ఫారంమీద తను మద్రాసు నుంచి హైద్రాబాదు వస్తున్నప్పుడు తోవలో కనిపించిన తుంటరి యువకుడు!... అచ్చుగుద్దినట్లు జ్ఞాపకం ఆ పిల్లకి!

ఆమె పాట పాడలేదు!.. మాటలాడలేదు!...

“అబ్బాయికి అమ్మాయి నచ్చిందికాబట్టి, యింక మనం మిగిలిన లాంఛనాలూ అవీ...” అంటూ పరంధామయ్యగారు అంటున్నారు.

అతని కాబోయే వియ్యంకుడూ, సీత తండ్రీ అయిన ముకుందరావు వింటున్నాడు. చాటంత మొహం జేసుకుని....

ఇంతలో ఆయింటి పెద్దకూతురు తల్లిప్రక్కనే గబగబావచ్చి చతికిలబడి "కొంపమునిగింది!" అన్నది గుసగుసగా!...

"ఏం తల్లి? ..... ఏమిటి?" అని విస్తుపోయిందాయిల్లాలు.

ఇద్దరు పురుషపుంగవులూకూడా అటుకేసి ఆత్రంగా చూసేరు.

"అది నూతిలో పడుతుందిటః!...." అంది అక్క క్లుప్తంగా.

"ఎంత అప్రదిష్ట... ఏంతల్లీ... ఎందుకని?..." అని గుండె బాదుకుంది యిల్లాలు.

తర్వాత, ఆయింటిల్లిబాదీ లోపలికి వెళ్లారు ఒక్క రామారావు, అతగాడి తండ్రీతప్ప.

కొంచెంసేపటికి సంగతంతా బహిరంగమయింది!...

సీతకి యీ రామార్రావుని పరించడం సుతారమూయిష్టంలేదు?...

రామారావుకి గొంతుక పిడచకట్టుకపోయింది. చేజిక్కిన స్వర్గం జారిపోయింది!...

పరంధామయ్య మాత్రం తాటాకు మంటలాగ లేచి... పైపంచె ఫట్టునదులిపి మరీ' ఆ గడప దాటేడు!

అందుకనే ఒక్క రామారావే దురదృష్టవంతుడు అన్నాను.

అతన్ని సీత ఒల్లలేదని కాదు!... అంతమంది రోడ్డుపైడ్ రోమియోలుండగా యితనొక్కడే యింత అపవాదు మోసినందుకు!...

(1959 చుక్కాని)